ప్రజాశక్తి
గురువారం 08 ఫిబ్రవరి 2024
5
కర్నూలు

పిల్లల పండగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కర్నూలు బాలోత్సవ సంబరాలు
- వేడుకలను ప్రారంభించనున్న కలెక్టర్
- మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో నిర్వహణ
- పాల్గొంటున్న 3 వేల మందికిపైగా విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు బాలోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురు, శుక్రవారాల్లో జరగనున్న ఈ వేడుకలకు కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదిక కానుంది. దాదాపు 3 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే విధంగా ప్రతేడాది కర్నూలు బాలోత్సవ కమిటీ రెండు రోజులపాటు ఉత్సాహ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తోంది. వరుసగా మూడోసారి కర్నూలు బాలోత్సవ సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో కర్నూలు డివిజన్ పరిధిలోని 250 పాఠశాలలు పాల్గొంటున్నాయి. దాదాపు 3 వేల మంది విద్యార్థులు రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. మొదటిరోజు వేడుకలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. బాలోత్సవాల నిర్వహణకు మూడు వేదికలు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కల్యాణమ్మ పేరుతో, రెండో వేదిక జెవివి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు చెన్నకేశవరెడ్డి కళావేదికగానూ, మూడో వేదిక యుటిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ పేరుతో ఏర్పాటు చేశారు. రెండో రోజు జరిగే ఉత్సవాలకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంతోపాటు గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య, రాజశేఖర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ సతీష్, డాక్టర్ వినోద్ హాజరు కానున్నారు. విద్యార్థులకు డ్యాన్స్, సింగింగ్ పోటీలతోపాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్, కార్యదర్శి జెఎన్.శేషయ్యలు వెల్లడించారు. బాలోత్సవ వేడుకల్లో విద్యార్థులు భాగస్వామ్యమయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వారు కోరారు.

అంకెల గారడీ...

- జిల్లాకు మొండిచేయి
- రాష్ట్ర బడ్జెట్‌పై వ్యక్తమవుతున్న ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2.86 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఆ బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన కేటాయింపులేవీ కనిపించలేదు. జిల్లాలోని గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ వంటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయించలేదు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ప్రస్తావన లేదు. ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల కోసం నిధుల కేటాయింపు జరగలేదు. రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

> రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అంకెల గారడీగా ఉందని, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపారు...

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించిన బడ్జెట్

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి

రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమ అభివృద్ధి గురించి కానీ, కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం కానీ కేటాయింపులు లేకపోవడం శోచనీయం. రాయలసీమ అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో ఈ బడ్జెట్ ప్రసంగం ద్వారా వైసిపి ప్రభుత్వం స్పష్టం చేసింది. బడ్జెట్ ప్రసంగం తీరు చూస్తే రాజకీయ ప్రసంగం లాగా, బటన్ నొక్కుడు కార్యక్రమం లాగానే ఉంది. రాయలసీమలోని యువతకు ఉపాధి కల్పించడానికి కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తానే చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులూ చేయకపోవడం ఈ ప్రాంతం పట్ల ముఖ్యమంత్రి చిత్తశుద్ధి స్పష్టమైంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి ఈ బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రాధాన్యత సాగునీటి ప్రాజెక్టుల్లో భాగంగా కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం, వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణం గురించి ఎందుకు ప్రస్తావించలేదో సమాధానం చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు ఎందుకు నిధులు కేటాయించలేదో కర్నూలు జిల్లాలో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు స్పష్టంగా చెప్పాలి.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

రాష్ట్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌గా ఉంది. ఐదేళ్లలో ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా చేసినట్లు అబద్ధాలు చెప్పడం సరైంది కాదు. చివరి బడ్జెట్ అయినా రాయలసీమ జిల్లాలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించినా ఈ బడ్జెట్ రాయలసీమ జిల్లాలకు నిరాశనే మిగిల్చింది. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి నిధులూ కేటాయించలేదు. కడప స్టీల్ ప్లాంట్‌ను గాలికి వదిలేశారు. అంకెల గారడీగా ఉన్న ఈ బడ్జెట్ పనికిమాలిన బడ్జెట్. విభజన హామీలు నెరవేర్చినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బడ్జెట్ కర్నూలు జిల్లాకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదు.

వ్యవసాయరంగానికి ప్రాధాన్యత

- ప్రొఫెసర్ మన్సూర్ రెహమాన్, ఆర్థికవేత్త

విద్య, వైద్య రంగాల్లో చూపిన కేటాయింపులు 'మానవ మూలధన సంపద కల్పన'కు దోహదపడతాయి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయ రంగ వృద్ధి రేటు 36.9 శాతం ఉండి రాష్ట్ర ఆదాయంలో ఈ రంగపు వాటా 40 శాతంగా నమోదైంది. దేశ మత్స్య ఉత్పత్తిలో రాష్ట్ర వాటా 30 శాతం. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధి రేటు 11 శాతం ఉండగా అది ప్రస్తుతం 16 శాతానికి పెరిగింది. ఇది జాతీయ వృద్ధి రేటు కంటే ఎక్కువ. జాతీయ తలసరి ఆదాయం రూ.2 లక్షలు ఉండగా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2.2 లక్షలుగా ఉంది. ప్రతి జిల్లానూ పార్లమెంటు స్థానంగా ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యం అవుతుంది.

ప్రజలను మోసగించిన బడ్జెట్

- డిసిసి అధ్యక్షులు కె.బాబురావు

బడ్జెట్‌తో మరోసారి ప్రజలను మోసగించారు. నాలుగు సంవత్సరాల పాటు నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధిని మాత్రం విస్మరించారు. దాదాపు రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి ఏం ఒరగబెట్టారు. కర్నూలు జిల్లాలోని వెనుకబడిన ప్రాంతానికి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు కానీ, ఇతర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు కోరారు. బుధవారం నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2020-21వ సంవత్సరంలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొస్తామని.. విద్యుత్ సవరణ బిల్లు రైతు సంఘాలతో చర్చించిన తర్వాత పార్లమెంటులో ప్రవేశపెడతామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు జరగలేదని అన్నారు. అలాగే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాల్లో మార్పులు తెస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. రైతులు, కార్మికులు చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ బంద్‌తో పాటు పట్టణ ప్రాంతాల్లో కార్మిక వర్గం సమ్మె చేసి ఆందోళనలో పాల్గొనాలని కోరారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో తీసుకొచ్చిన చట్టం వల్ల డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు జె.నాగేశ్వరరావు, ఈరన్న, ప్రభాకర్, నారాయణ స్వామి, నిర్మల, విజయ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి నూతనంగా బదిలీపై వచ్చిన అందరూ తహశీల్దార్లతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పెండింగ్ ఫారాలు, ఎన్నికల సన్నద్ధతపై వారికి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ కూడా ఫారాలు వస్తూనే ఉన్నాయని, వాటిని కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వారంలో ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించి ఏ నియోజకవర్గానికి ఏ స్ట్రాంగ్ రూమ్ అనేది రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తామని చెప్పారు. అదే విధంగా ఇంటర్మీడియరీ డిస్పాచ్ సెంటర్‌ను కూడా పరిశీలించి వాటినీ ఫైనలైజ్ చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మినహా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిలో ఏమైనా మౌలిక సదుపాయాలు లేకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలక్ట్రోరల్ రోల్‌లో చిరునామా మార్పు, పేర్లు తప్పుగా ఉంటే, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. డిఆర్‌ఒ కె.మధుసూదన్ రావు, బిజెపి ప్రతినిధి సాయి ప్రదీప్, టిడిపి ప్రతినిధి ఎల్‌వి.ప్రసాద్, వైసిపి ప్రతినిధి కె.పుల్లారెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

రోడ్డు ప్రమాదంలో

తల్లీకూతురు మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొన్న కారు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/పెద్దకడబూరు

ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వెళ్లే 167వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి చెందారు. బుధవారం పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన బోయ దస్తగిరి భార్య జయలక్ష్మి (38), ఆమె మరిది కూతురు చెక్రి అక్షర (5)లు పొలం పనులకు బయల్దేరారు. గ్రామ సమీపంలోని నలంద బిఇడి కళాశాల వద్ద రోడ్డు దాటుతుండగా ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వేగంగా వస్తున్న ఎపి 21 బిఎల్ 5632 కారు వారిని ఢీకొట్టింది. జయలక్ష్మి, అక్షరను దాదాపు 100 అడుగుల దూరం వరకు కారు ఈడ్చుకెళ్లింది. వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ వాహనం పోలీసులు రఘు, హనుమంతు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జయలక్ష్మి, అక్షర మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తల్లి, కూతురు

నుజ్జునుజ్జయిన కారు

పట్టుకున్న నగదును చూపుతున్న పోలీసులు

రూ.60 లక్షలు నగదు పట్టివేత

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు బుధవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా సరిహద్దు పంచలింగాల చెక్ పోస్టు వద్ద సమాచారం మేరకు వాహనాల తనిఖీలు చేపట్టగా రూ. 60 లక్షలు నగదు పట్టుబడింది. హైదరాబాదు నుండి బెంగుళూరు వెళుతున్న కెఎస్‌ఎం ప్రవేట్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న అనంత ఇంజనీరింగ్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీకి చెందిన జిలానీ, సుమన్‌ల నుండి ఎలాంటి ఆధారాలు లేని రూ. 60 లక్షల నగదును కర్నూలు తాలుకా సెబ్ పోలీసులు పట్టుకున్నారు. సీజ్ చేసిన నగదును రెవిన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు ఆదాయపు పన్ను శాఖ వారికి లేఖను రాశామన్నారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, సెబ్ ఎస్సై పృథ్వీరాజ్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ

ప్రజాశక్తి - తుగ్గలి : జిల్లాలో అత్యంత వెనుకబడిన మండలమైన తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తుగ్గలిలో సిపిఎం మండల కార్యవర్గ సమావేశం మండల కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన తుగ్గలిని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించకపోవడం విచారకరమన్నారు. అనంతపురం జిల్లా సమీపంలో ఉన్న తుగ్గలి మండలంను కరువు మండలంగా ప్రకటించినకపోవడం పాలకుల నిర్లక్ష్యమన్నారు. ఈ నెల 12న తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు రంగస్వామి, శ్రీను, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు రామకృష్ణ

టిడిపి గెలుపుతోనే యువత కష్టాలు దూరం

- కర్నూలు ఇంచార్జి టి.జి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నిరుద్యోగులకు ఈ ప్రభుత్వంలో కన్నీళ్లే మిగిలాయని, టిడిపి గెలుపు వారి సమస్యలను పరిష్కరిస్తాయని ఆ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. బుధవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న అశోక స్టడీ సెంటర్‌లో నిరుద్యోగులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రెండు సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. ఈ ఐదేళ్లుగా నోటిఫికేషన్ కోసం యువతీ, యువకులు ఎదురుచూసినా ఫలితం దక్కలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే నిరుద్యోగులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. యువతీ, యువకులు కొందరు ముందుకొస్తే తానే స్వయంగా తీసుకెళ్లి చంద్రబాబు, లోకేష్‌తో మాట్లాడిస్తానని చెప్పారు. తమ ప్రభుత్వం వస్తే 20 లక్షల ఉద్యోగాలు రాష్ట్రంలో వస్తాయన్నారు. ఇక కర్నూల్లో తనను గెలిపిస్తే పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లాను మొత్తం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు కానీ, తాను కానీ డబ్బుల కోసం రాజకీయాల్లో ఉండటం లేదన్నారు. ప్రజలకు మేలు చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ విషయాలన్నీ యువత గ్రహించాల్సిన సమయం వచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలను తామొచ్చిన తర్వాత శుద్ధిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అశోక స్టడీ కేంద్రంలో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతున్న టిజి భరత్

ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

ఓపిఎస్‌ను పునరుద్ధరించి సిఎం జగన్మోహన్ రెడి ఇచ్చిన మాట నిలుపుకోవాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ క్రిష్ణగిరి మండల శాఖ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి, టిడిపి అధినేత నారాచంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్, ఏపిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలారెడ్డిలకు పోస్టుకార్డులు రాసి క్రిష్ణగిరి పోస్టాఫీసులోని పోస్టు డబ్బాలో వేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో సిపిఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని, ఓపిఎస్ పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించాలని, అలా ప్రకటించిన వాళ్లకే తమ ఓట్లు వేస్తామని లేఖలు రాశామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు ప్రసాదరెడ్డి, మండల గౌరవాధ్యక్షులు టిఎల్ నారాయణరెడ్డి, అధ్యక్షులు రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా కౌన్సిలర్లు డి.రాములు, మోహన్, కార్యకర్తలు సరళ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఆశావర్కర్ల అక్రమ అరెస్టులు అన్యాయం : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని, అక్రమ అరెస్టులను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జిల్లా నాయకులు నాగేశ్వరరావు ఖండించారు. బుధవారం వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో 3, 4వ పట్టణ పోలీసులు సచివాలయాల దగ్గరికి వెళ్లి డ్యూటీలో ఉన్న ఆశ వర్కర్లను చలో విజయవాడ కార్యక్రమానికి పోతున్నారనే నెపంతో స్టేషన్లకు పిలుచుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్టేషన్కు రాకపోతే ఇండ్ల దగ్గరకు వచ్చే అరెస్టు చేస్తామని బెదిరించడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనలే కాక విధులు చేస్తున్న వారిని కూడా భయభ్రాంతులను చేయడం సరైన పద్ధతి కాదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో దోమల నివారణ చర్యలు బుధవారం చేపట్టారు. జోహరపురం క్రొత్త బ్రిడ్జి వద్ద, హంద్రీ నదిలో దోమల గుడ్లకు అవాసం అవుతున్న గుఱ్ఱపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టారని ప్రజారోగ్య అధికారి డా.కె. విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు.

తహశీల్దార్‌కు విఎఒలు సన్మానం

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంత ఆచారిని, డిప్యూటీ తాసిల్దార్ ధనుంజయ రెడ్డిని సిబ్బంది, విఎఒలు పూలమాలతో స్వాగతం పలికి బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో విఎఒ సంఘం మండల అధ్యక్షుడు అయ్యస్వామి, ఉపాధ్యక్షులు ఉస్మాన్ బాషా, అల్లుగుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస్ పరీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని ఇందిరా గాంధీ మెమోరియల్ స్కూల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ పరీక్ష బుధవారం నిర్వహించారు. సిటీ సహాయ కార్యదర్శి ఆర్యన్ సిటీ ఉపాధ్యక్షులు మల్లేష్, మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ మోడల్ టెస్ట్ ఎగ్జామ్ చాలా రకాల ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులు భయాందోళనకు, మానసికంగా ఒత్తిడి గురి కాకుండా ముందుగానే ఈ విధంగా ప్రతిభ పరీక్షను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సిటీ నాయకులు గ్రీష్మంత్, హేమంత్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు కనీసం ముప్పై సంవత్సరాలు కూడా పటిష్టంగా లేకపోవడం అప్పటి అధికారులు, కాంట్రాక్టర్లు చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్లతనం ట్యాంకును చూస్తే అర్థమవుతుంది. రోజు రోజుకు పెచ్చులు ఊడి పడుతుండటంతో వాటర్ బాయ్‌తో పాటు అటుగా వెళ్లే వారు భయం భయంతో వెళ్తున్నారు. అయినా ఈ ట్యాంకే గ్రామానికి నీటి సరఫరా దిక్కుగా అయ్యింది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని, ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టి మరో కొన్నేళ్లు ఉపయోగకరంగా ఉండేలా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

ఆర్‌యు రెక్టార్‌గా ఎన్‌టికె నాయక్

రిజిస్ట్రార్‌గా నాగుల అంకన్న

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమ వర్సిటీ రెక్టార్‌గా ఎన్‌టికె నాయక్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. అలాగే వర్సిటీ రిజిస్ట్రార్‌గా కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ విభాగం ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ నాగుల అంకన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ఇరువురు బాధ్యతలు స్వీకరించనున్నట్లు వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రజాశక్తి వార్తకు స్పందన

కదిలిన మార్కెట్ అధికారులు, పాలక మండలి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'తక్‌పట్టి కోసం రైతుల అవస్థలు' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన వార్తకు కర్నూలు వ్యవసాయ మార్కెట్ పాలకమండలి, అధికారులు స్పందించారు. బుధవారం రైతులకు 2 గంటలకు తక్ పట్టి ఇవ్వడంతో పాటు, ధాన్యంను తూకం కూడా వేయించారు. సమయానికి తక్ పట్టి ఇవ్వడం వల్ల రైతులు, హమాలీలు హర్షం వ్యక్తం చేశారు. ఒక్క రోజుతో కాకుండా నిత్యం సమయానికి తక్‌పట్టి ఇవ్వాలని రైతులు, హమాలీలు, కార్మికులు, కమీషన్‌దారులు కోరుతున్నారు.

కేవలం లక్ష రూపాయలకే పల్సర్ బైక్

- అతి తక్కువ డౌన్ పేమెంట్‌కే బైక్ సొంతం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని బంగారుపేటలో ఉన్న భారత్ బజాజ్ షోరూంలో పల్సర్ 125 సిసి కేవలం లక్ష రూపాయలకే అందుబాటులోకి వచ్చింది. సిబిల్ స్కోర్‌పై బంపర్ ఆఫర్ ప్రారంభమైంది. సిబిల్ స్కోర్ బట్టి అతి తక్కువ డౌన్ పేమెంట్‌కే బైక్ సొంతమవుతుంది. కేవలం పల్సర్‌పై కాకుండా ప్లాటినా, సిటి 100 తదితర వాహనాలపై కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది. అదరగొట్టే థ్రిల్, సాటిలేని ధరలతో ఉన్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని భారత్ బజాజ్ సేల్స్ మేనేజర్ ఫరూక్ కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 8121720443 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భారత్ బజాజ్ బైక్ షోరూమ్

పట్టపగలు యువకుడిపై కత్తులతో దాడి

- వివాహేతర సంబంధమే హత్యాయత్నానికి కారణం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో పట్టపగలే ఓ వ్యక్తిపై దుండగులు కత్తులతో దాడి చేశారు. బుధవారం పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన బోయ గుజ్జుల సోమేష్‌పై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కత్తులతో పొడిచి పరారయ్యారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ పెద్ద పార్కు లైన్ రోడ్డుపై మధ్యాహ్నం స్కూటర్‌పై వెళ్తున్న గుజ్జుల సోమేష్‌ను వెంకటాపురానికి చెందిన కొందరు అడ్డగించి కత్తులతో పొడిచి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. రోడ్డుపై జనం గుమిగూడి వీడియోలు తీశారు. సోమేష్ బంధువులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమేష్ బంధువుల వివరాల మేరకు... వెంకటాపురంలోని ఓ వివాహితతో సోమేష్‌కు వివాహేతర సంబంధం ఉండేది. అందులో భాగంగా వారి కుటుంబ సభ్యులు అవమానంగా భావించి దాడికి పాల్పడినట్లు తెలిపారు. సోమేష్ వివాహేతర సంబంధంపై గతంలో పెద్దలు పంచాయితీ చేశారు. సోమేష్ వెంకటాపురం వదిలి బంధువుల ఊరికి వెళ్లారు. ఇటీవలే వెంకటపురానికి చేరుకున్నారు. అవమానంగా భావించిన మహిళ తరపు బంధువులు దాడికి పాల్పడ్డారు. సోమేష్‌ను ఎలాగైనా హత్య చేయాలని అనుకున్నారు. అనుకున్న ప్రకారం చేశారు. సోమేష్ వీపు వెనుక భాగంలో కత్తి పోట్లు పడ్డాయి. ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సోమేష్‌ను ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ సిఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... వెంకటాపురం గుజ్జుల సోమేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారని తెలిపారు. సమాచారం అందుకున్న తాము అక్కడికి వెళ్లి సోమేష్‌ను ఆస్పత్రికి తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బిటి రోడ్డుకు భూమి పూజ

- రూ.10 కోట్లతో చిప్పగిరి నుంచి మద్దికెర వరకు బిటి రోడ్డు పనులు

ప్రజాశక్తి - చిప్పగిరి



భూమి పూజ చేస్తున్న వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ మారయ్య

బిటి రోడ్డు పనులకు వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి భూమి పూజ చేశారు. చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెరకు వెళ్లే రహదారికి ఎట్టకేలకు తొలి అడుగు పడడంతో మండల ప్రజలు హర్షం వ్యక్త చేస్తున్నారు. బుధవారం చిప్పగిరిలోని ఎస్సీ కాలనీ దగ్గర స్థానిక సర్పంచి దాసరి గోవిందరాజులు అధ్యక్షతన వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి, ఎంపిపి భర్త, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, దౌల్తాపురం సర్పంచి లక్ష్మి దేవమ్మ, నంచర్ల సర్పంచి భీమా బిటి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విరుపాక్షి, మారయ్య మాట్లాడారు. చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు 13 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. రూ.10 కోట్లు మంజూరు కావడంతో బిటి రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు రోడ్డు పనులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తి చేస్తే ప్రజలంతా కూడా సంతోషిస్తారని తెలిపారు. ఈ రోడ్డు వల్ల చిప్పగిరి మండల ప్రజలకు, అటు మద్దికెర మండల ప్రజలకు ప్రయాణం ఎంతో తగ్గుతుందన్నారు. పనులు ప్రారంభం కావడంతో ఇరు మండలాల ప్రజలు సంతోషిస్తున్నారని చెప్పారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట ప్రసాద్, డిఇ భాస్కర్, జెఇ మూర్తి, ఉప సర్పంచులు పెద్ద పెద్దయ్య, హనుమంతు, కో కన్వీనర్ లోకనాథ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నాగప్ప, గంగాధర్, షేకన్న, మహానంది, శ్రీరాములు, వెంకటేష్, హనుమంతు పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించామని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణనలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని వివరించారు. ఓటరు జాబితాపై ఏదైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహశీల్దార్, ఏఈఆర్‌ఓ ఆర్ఎన్.హసీనా సుల్తాన్, డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎజాజ్ అహ్మద్, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, టిడిపి నాయకులు బుద్దారెడ్డి, వైసిపి నాయకులు ప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు నీలకంఠప్ప ఉన్నారు.

జడ్‌పిటిసికి మంత్రి సోదరుని బెదిరింపులు

- ఆడియో లీక్‌తో కలకలం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి జడ్‌పిటిసి దొరబాబుపై మంత్రి గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ స్వామి మాట్లాడిన బూతు పురాణం ఆడియో లీక్ కావడంతో కలకలం రేపింది. ఈ వార్తను న్యూస్ ఛానెల్ ప్రచారం చేయడంతో జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఈ ఆడియో లీక్‌పై జోరుగా చర్చ సాగుతోంది. ఈనెల 11న అనంతపురంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభ విజయవంతం చేయాలని ఈనెల 5న ఆస్పరిలోని రామతీర్థం వద్ద ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి దొరబాబు మాట్లాడారు. ఈ మాటలను మంత్రి సోదరులు నారాయణస్వామి వీడియోను చెప్పించుకొని చూసి 'మంత్రిని విమర్శిస్తూ మాట్లాడతావా' అంటూ దురుసుగా మాట్లాడినట్లు ఆడియో లీక్ ద్వారా తెలిసింది. 'గతంలో జరిగిన విషయాలు చెప్పాను తప్ప మంత్రి గురించి విమర్శించలేదు' అని దొరబాబు తెలిపారు. నారాయణస్వామి ఈ మాటలను పట్టించుకోకుండా 'నిన్ను చంపుతాం' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయాలను జడ్‌పిటిసి దొరబాబు వైసిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య బుధవారం ఆస్పరికి వచ్చి జడ్‌పిటిసిని కలిశారు.

నాకు ప్రాణహాని ఉంది : జడ్‌పిటిసి దొరబాబు

మంత్రి సోదరుడు నారాయణ స్వామి నుంచి ప్రాణహాని ఉందని ఆస్పరి జడ్‌పిటిసి దొరబాబు తెలిపారు. బుధవారం ఆయన స్వగృహంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను మంత్రిపై విమర్శలు చేయకపోయినా నారాయణ స్వామి తనను అవమానకరంగా ధూషించారని వాపోయారు. 'నీ అంతు చూస్తా' అంటూ బెదిరింపులకు పడ్డారన్నారు. వైసిపి అధిష్టానం తనకు న్యాయం చేయాలని కోరారు. గుడిసె మహానంది, మాజీ సొసైటీ ఛైర్మన్ మాట్లాడుతూ... మంత్రి సోదరుడు తమకు కూడా ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. మంత్రి సోదరుడి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు

- వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య

పార్టీ నాయకులు, కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య హెచ్చరించారు. ఆలూరులో జరుగుతున్న పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. బెదిరింపులకు పాల్పడితే పార్టీ పరంగా, చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

టిడిపితోనే గ్రామాలాభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపి గెలిచి తీరాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపి గ్రామ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వైసిపి పాలనలో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వైసిపి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో సంక్షోభం సృష్టించారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలతో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిమ్మారెడ్డి, పెద్దయ్య, గురునాథ్ రెడ్డి, నరసప్ప గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న జయ నాగేశ్వర రెడ్డి

కొలతలు తీసుకున్న అధికారులు

ఎల్ఎల్‌సి బ్రిడ్జి ఆధునికీకరణ పనులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె గ్రామ స్టేజీ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న ఎల్ఎల్‌సి బ్రిడ్జి ఆధునీకరణ పనులను రూ.30 లక్షలతో చేపట్టినట్లు ఎల్ఎల్‌సి ఎఇ ఉదయ భాస్కర్, ఆర్అండ్‌బి జెఇ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం బ్రిడ్జి పొడవు, వెడల్పు, ఎత్తు పెంచేందుకు కొలతలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాన రహదారిపై ఎల్ఎల్‌సి బ్రిడ్జిపై ఉన్న వంతెన వాహనాల రాకపోకల పెరుగుదలతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ప్రభుత్వం ఈ బ్రిడ్జిని ఆధునీకరించేందుకు రూ.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే 12 మీటర్ల పొడవు, 8 మీటర్ల వెడల్పు, 10 అడుగుల ఎత్తుతో బ్రిడ్జిని నూతనంగా నిర్మించేందుకు పనులను చేపడతామని తెలిపారు. లస్కర్ అర్జున్, ఆర్అండ్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

'సిద్ధం'కు భారీగా తరలిరండి

- వైసిపి జిల్లా అధ్యక్షులు రామయ్య

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 11న అనంతపురం జిల్లాలో నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభకు భారీగా తరలి రావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, జెసిఎస్ జిల్లా కన్వీనర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి కోరారు. బుధవారం హొళగుందలో జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. రాష్ట్రంలో దుష్ట చతుష్టయంతో యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. విరుపాక్షి మాట్లాడుతూ... నియోజకవర్గంలో కార్యకర్తల బాధలన్నీ తాను తెలుసుకున్నానని తెలిపారు. అందరికీ న్యాయం చేస్తానని, రాబోయే 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. **హాలహర్విలో** 'సిద్ధం' గోడపత్రికను వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరులో వైసిపి జెండా ఎగుర వేసి జగనన్నకు కానుకగా ఇద్దామని, మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని కోరారు. వైసిపి మండల కన్వీనర్ రామిరెడ్డి, కో కన్వీనర్ మల్లికార్జున, తిప్పారెడ్డి, జూటూరు మారయ్య, సుంకన్న పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపిదే గెలుపు

- 'సిద్ధం' గోడపత్రికను ఆవిష్కరించిన టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి, వైసిపి యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం : రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడం ఖాయమని టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, వైసిపి యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో 'సిద్ధం' గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించే 'సిద్ధం' సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. టిడిపి పొత్తు లేకుండా పోటీ చేసే పరిస్థితి లేదని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయాన్ని అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వైసిపి నాయకులు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి ఉన్నారు.

హొళగుందలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

హాలహర్విలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీతారామిరెడ్డి, ప్రదీప్ రెడ్డి

అచ్చెన్నాయుడును కలిసిన నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే టికెట్ కోసం టిడిపి అధిష్టానాన్ని కలిసినట్లు యువ నాయకులు ఎ.నూర్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. టిడిపి ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలో భాగంగా టిడిపి అధిష్టానం పిలుపుతో మంగళగిరిలో గల టిడిపి ప్రధాన కార్యాలయానికి చేరుకుని రెండు రోజులుగా ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు వివరించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడును, శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌ను, టిడిపి ఆఫీస్ బేరర్లను కలిసినట్లు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో తనకు పెరుగుతున్న ఆదరణ గురించి వివరించానని చెప్పారు. తన అభ్యర్థిత్వంపై టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్ర బాబుతో చర్చించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారని అన్నారు. తనకు ఉన్న విజయ అవకాశాల గురించి అచ్చెన్నాయుడుకు వివరించానని తెలిపారు.

ఐదుగురు నిందితులకు జైలు శిక్ష

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన ఐదుగురు నిందితులకు పత్తికొండ మేజిస్ట్రేట్ జైలు శిక్ష, రూ.18 వేల జరిమానా విధించినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. 2014లో తెర్నేకల్ గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తుండగా నిందితులు బాటమీది రాజు, చిన్న వెంకప్ప, హనుమంతు, తిమ్మప్ప అడ్డగించి పించన్ల విషయంలో దాడి చేసినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని తెలిపారు. అప్పటి నుండి ఈ కేసు కోర్టులో వాయిదాలతో నడిచిందని చెప్పారు. సాక్ష్యాధారాలు నిర్ధారణ కావడంతో పత్తికొండ మేజిస్ట్రేట్ నిందితులకు జైలు శిక్షతోపాటు జరిమాన విధించిందని తెలిపారు.

కళ్లలో కారం చల్లి రూ.2 లక్షలు అపహరణ

- అమృత రెస్టారెంట్ వారి డబ్బు ఇంటికి తీసుకెళ్తుండగా దాడి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. మంగవారం అర్ధరాత్రి పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వెనుక ఉన్న సాయిబాబా దేవాలయం నుంచి సోమప్ప నగర్‌కు వెళ్తున్న రోడ్డులో రెస్టారెంట్ గుమాస్తా కళ్లలో కారం చల్లి రూ.2 లక్షల నగదు దోచుకెళ్లారు. ఎమ్మిగనూరు పట్టణం సోమప్ప నగర్‌కు చెందిన మిన్నప్ప పట్టణంలోని అమృత రెస్టారెంట్‌లో గుమాస్తాగా పని చేస్తున్నారు. రెస్టారెంట్‌లో పని ముగించుకొని డబ్బులను బ్యాగులో పెట్టుకొని స్కూటర్‌కు బ్యాగ్ తగిలించుకొని ఇంటికి బయల్దేరారు. ముగ్గురు గుర్తు తెలియని దుండగలు ముఖాలకు మంకీ క్యాప్‌లు ధరించి స్కూటర్‌పై వెళ్తున్న మిన్నప్ప కళ్లలో కారం చల్లి, అతని వద్ద ఉన్న రూ.2 లక్షలు దోచుకొని పక్కన ఉన్న పొలంలోకి పరారయ్యారు. సంఘటనపై బాధితుడు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఎలా ఉన్నాయని బుధవారం మండలంలోని అనేక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తహశీల్దార్ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేమకల్లు గ్రామంలో పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై సచివాలయ అధికారులకు సూచనలు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే విధంగా చూసుకుంటున్నామని తెలిపారు. విఆర్‌ఓ ఈరన్న, డిజిటల్ అసిస్టెంట్ దినేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- ఆర్‌టిసి డిఎం మహ్మద్ రఫీక్

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎమ్‌డి.మహ్మద్ రఫీక్ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆదోనిలోని ఎన్ఎంఎంహెచ్ పాఠశాల విద్యార్థులకు ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీక్ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎడమ వైపు నడవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, రోడ్డు సంకేతాలను గమనించాలని తెలిపారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు ఎదుటి వాహనాలను గమనిస్తూ నెమ్మదిగా వెళ్లాలని ఎంఎఫ్ వేణుగోపాల్, ఎస్‌టిఐ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీకోట చంద్రమౌళేశ్వర దేవాలయం అభివృద్ధికి తోవి సర్పంచి గిట్టర్ నరసప్ప విరాళం అందజేశారు. బుధవారం దేవాలయానికి రూ.25 వేలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి నరసప్ప మాట్లాడారు. ప్రజలు సన్మార్గంలో నడిచి మంచి పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు.

అందరినీ కలుపుకొని ప్రచారం చేయాలి

- మాజీ సర్పంచి దివాకర్ నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి మండలంలోని వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులందరినీ కలుపుకొని గ్రామాల్లో ప్రచారం చేపట్టాలని వైసిపి మండల నాయకులు, కప్పట్రాళ్ల మాజీ సర్పంచి దివాకర్ నాయుడు తెలిపారు. బుధవారం సహకార సొసైటీ ఫంక్షన్ హాలులో వివిధ గ్రామాల వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొందరపడి ఎవరూ అనాలోచిత నిర్ణయాలు తీసుకోరాదని, వైసిపి కోసం అందరూ సహకారం అందించాలని తెలిపారు. ఇటీవల కొంతమంది నాయకుల సూచనలతో విరుపాక్షి మండలంలో ప్రచారం నిర్వహించారని చెప్పారు. సర్పంచులు, నాయకులకు సమాచారం ఇవ్వకుండా లక్కందిన్నె, జిల్లేడుబుడకల గ్రామాలకు వచ్చారని ఆయా గ్రామాల వారు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయం చేస్తానని, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అన్యాయం జరిగితే సహించనన్నారు. అవసరమైతే మండలంలో కొందరు వైసిపి నాయకులు అనుసరిస్తున్న వైఖరిని, విధానాలను ముఖ్యమంత్రి సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తానని హెచ్చరించారు. గ్రామాల్లో పర్యటించేటప్పుడు అందరినీ సమానభావంతో చూడాలని సూచించారు. ఎంపిపి లక్ష్మీదేవమ్మ భర్త లుముంబా మండల పరిషత్ నిధులు ఇవ్వడం లేదని చెల్లెల చెలిమెల, నెల్లిబండ, ఐరన్ బండ ఎంపిటిసిలు విమర్శించారు. కరివేముల, పల్లెదొడ్డి, ఐరన్ బండ బి సెంటర్, కొత్తపేట, జిల్లేడు బుడకల, నెల్లిబండ గ్రామాల సచివాలయ కన్వీనర్లు ఎల్‌కె.శ్రీనివాసులు, చంద్రన్న, నరసింహ స్వామి, బాబు, గోసి కౌలుట్ల, సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు చిన్నయ్య శెట్టి, టోపీ యూసుఫ్ బాషా, తిరుమలేష్ నాయుడు, వెంకట రాముడు, పాడే రంగన్న, కొండారెడ్డి, నాయుడు, కె.వెంకటాపురం మాజీ సర్పంచి వెంకటేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్ నాయుడు

వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- ఎపి వాల్మీకి న్యాయవాదుల సంఘం

ప్రజాశక్తి - ఆదోని

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వాల్మీకుల జనాభా ప్రాతిపాదికన అన్ని రాజకీయ పార్టీలూ 8 ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కేటాయించాలని ఎపి వాల్మీకి న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని భీమాస్ ఫంక్షన్ హాలులో న్యాయవాది ఆనంద్ అధ్యక్షతన జరిగిన న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులు రాజకీయంగా ఎదగాలంటే అత్యధిక సీట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు గోపాల కృష్ణుడు, కర్నూలు, డోన్, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, ఆదోని, బార్ అసోసియేషన్‌కు సంబంధించిన వాల్మీకి న్యాయవాదులు పద్మజ నాయుడు, భాస్కర్ నాయుడు, అర్జున్, వీరేష్, వెంకటేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

క్విజ్ పోటీలతో నైపుణ్యం పెంపు

- భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సదాశివ

ప్రజాశక్తి - ఆదోని

క్విజ్ పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల నైపుణ్యం పెంపొందుతుందని భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సదాశివ, సిఐ అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం శ్రీమహాయోగి లక్ష్మమ్మ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ, తృతీయ ర్యాంకులు సాధించిన జునైద్, తైబా జితేంద్రను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎప్పుడు పాఠశాల, పరీక్షలు కాకుండా ఇతర కాంపిటీషన్ నిర్వహిస్తే విద్యార్థుల్లో భయమనేది పోతుందని తెలిపారు. పరశురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

అసెంబ్లీ ముట్టడిని అడ్డుకోవడం దారుణం

- టిడిపి పార్లమెంట్ తెలుగు మహిళా అధికార ప్రతినిధి శశిరేఖ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని టిడిపి కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకొని పంచాయతీల్లో అభివృద్ధి జరగకుండా చేసిందని విమర్శించారు. తమ నిధులు తమకు ఇవ్వాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన సర్పంచులను అడ్డుకొని, ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. సర్పంచుల నిధులను వెంటనే విడుదల చేసి సర్పంచి గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. సర్పంచులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కూడా కాలరాయడం హేయమైన చర్య అని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఇచ్చి, వాటి గౌరవాన్ని కాపాడి, రాబోవు కాలంలో సర్పంచులకు, ఎంపిటిసిలకు, జడ్‌పిటిసిలకు, కౌన్సిలర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎఒ అవినీతిపై మరోసారి విచారణ చేపట్టాలి

- జిల్లా అధికారికి ఆధారాలు చూపిన జైభీమ్ ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎఒ జీరా గణేష్ అవినీతిపై మరోసారి విచారణ చేపట్టాలని జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ కోరారు. ఎఒ అక్రమంగా చేసిన నకిలీ విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలపై జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు జిల్లా అధికారి అరుణకుమారికి ఆధారాలు చూపించారు. బుధవారం స్థానిక వ్యవసాయ విత్తన పరీక్ష కేంద్రంలో ఎడిఎ మహ్మద్ ఖాద్రీ సమక్షంలో ఆమెను కలుసుకుని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ ఆధ్వర్యంలో చిక్కం జానయ్య మాదిగ, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాదిగలు మాట్లాడారు. ఎఒ గణేష్ వ్యవసాయ అధికారిగా కాకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బయో పురుగుమందు కంపెనీల భాగస్వామ్యంతో, మాలపల్లిలో ఉన్న వైభవ్ ట్రేడర్స్ యాజమాన్యంతో కలిసి బయో పురుగు మందులను, నకిలీ విత్తనాలను కర్ణాటక, ఆంధ్రకు సరఫరా చేస్తూ రూ.లక్షలు ఆర్జించారని తెలిపారు. కంపెనీ వాటా 50 శాతం, ఎఒ వాటా 50 శాతంగా వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. మండలంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందజేయగా, అందులోనూ ఎఒ లంచం కింద రూ.70 వేలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మండలంలో కొంతమంది విఎఎలను డ్రైవర్లుగా పెట్టుకొని విధులకు హాజరు కాకుండా తన ఇంటి పనులు కూడా చేయించుకుంటున్నారని తెలిపారు. ఎఒ గణేష్‌పై సమగ్ర విచారణ జరిపి, శాఖా పరమైన చర్యలు తీసుకొని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జై భీమ్ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్, రాష్ట్ర కమిషనర్ కార్యాలయాల ఎదుట రాస్తారోకాలు, ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, కందనాతి మారెన్న, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సురేష్ సుమాల మాదిగ, మండల అధ్యక్షులు పందికోన ఈరన్న, కోసిగి మండల ప్రధాన కార్యదర్శి పందికోన పరశురాం, మంత్రాల మండల అధ్యక్షులు నరసింహులు మాదిగ, మంత్రాలయం టౌన్ అధ్యక్షులు బెళగల్ గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి గర్జీ ప్రకాష్, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు మంచోలి ఆదాము, మండల ఇన్‌ఛార్జీ మంచోలి రవికుమార్ మాదిగ పాల్గొన్నారు.



అధికారితో మాట్లాడుతున్న నాయకులు

IN THE COURT OF THE IIND ADOL DISTRICT JUDGE KURNOOL AT ADONI
A.S. No.18/2017.

Between:-
Hanumanthamma and another. ...Appellants
Versus
A.Basappa and 3 others. ...Respondents

NOTICE TO RESPONDENTS NO.2 AND No.4.

To,
1.R-2 A.Hanumanthappa S/o. Late Thimmappa, cultivator, Hindu, aged about 65 years, resident of Holagunda Village and mandlam, Kumool District, A.P
2. R-4 Chinna Gangaiah @ Gangadhar, cultivator, Hindu, aged about 60 years, resident of Holagunda Village and mandlam, Kumool District, A.P.

Whereas the above named appellant fied the above case is for Partition suit. You are hereby order to take notice and appear before this court at 10.30 A.M. on 13-02-2024 in person or through advocate and file your objections if any. Else you will be set exparte and the above appeal will be decided in your absence.

//By Order of the Court//

Sri T. NAGARAJU,
Sri. T. MADHUSUDHAN,
Advocates for appellants,
Adoni

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్

ఎన్నికలకు పటిష్ట ప్రణాళికలు

- నోడల్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికల సమర్థ నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో ఎన్నికల సంసిద్ధతపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, హ్యాండ్ బుక్కులను నోడల్ అధికారులు క్షుణ్ణంగా చదివి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల విధులను అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను రాండమైజేషన్ పద్ధతిలో కేటాయించేందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని మ్యాన్ పవర్ కమిటీ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించే రీతిలో శిక్షణ కార్యక్రమాలు ఇవ్వాలని ట్రైనింగ్ మేనేజ్మెంట్ కమిటీ నోడల్ అధికారిని సూచించారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకొని లోటుపాట్లపై నివే దికను తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే మెటీరియల్ పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని సూచించారు. యువ ఓటర్ల నమోదుకు సంబంధించి అన్ని కళాశాలలు విద్యాసంస్థల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని స్వీప్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన, భద్రత, ట్రాన్స్పోర్ట్, సీలింగ్ తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఈవీఎం మేనేజ్మెంట్ నోడల్ అధికారిని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పర్యవేక్షించాలని యంసిసి, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్టోరల్ రోల్ పై ఎప్పటికప్పుడు చర్యలు చర్యలు తీసుకోవాలని సంబంధిత కమిటీ నోడల్ అధికారులను సూచించారు. లా అండ్ ఆర్డర్, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా మేనేజ్మెంట్, కంప్లైంట్ రెడ్రస్సల్ కమిటీలకు కేటాయించిన పనులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు అన్ని రకాల కమిటీలు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు.

ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరిచేస్తాం..

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్

తుది ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరి చేస్తామని జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, స్ట్రాంగ్ రూముల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఎ. పద్మజ, కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ భాష, తెలుగుదేశం పార్టీ శివరాముడు, వైసిపి తరపున సాయిరాం రెడ్డి, బిజెపి తరపున చంద్రశేఖర్, సిపిఐ (మార్క్సిస్టు) పార్టీ తరపున నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని తప్పొప్పులను సరి చేస్తామని వెల్లడించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు చాలెంజింగ్ ఓటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపుకు సంబంధించి శాంతిరాం ఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీలకు బదులుగా ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయవలసిందిగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరగా పరిశీలిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

బిజెపి మోసాలను ప్రజలకు వివరిస్తాం

ఎపి రైతు సంఘం, వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బిజెపి చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తామని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావులు తెలిపారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యకాస కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం రైతు సంఘం మండల కార్యదర్శి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి నాడు మోడీ రైతులకు స్వామినాథ కమిటీ సిఫారసులు అమలు చేసి వ్యవసాయాన్ని లాభాల్లోకి తీసుకొస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కార్మిక చట్టాలను కాపాడుతామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి భారత దేశ పేదలందరికీ అకౌంట్లో డబ్బు జమ చేస్తామని, అందరికీ ఉపాధి కల్పిస్తామని చెప్పి అధికారం చేపట్టిన అనంతరం నుంచి నేటి వరకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెంవేర్చలేదన్నారు. కులం, మతం పేరుతో విభజించి రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చెయ్యకుండా బిజెపి పబ్బం గడుపుకుంటుందని మండిపడ్డారు. ఈ విషయాలను ప్రజలకు చేరవేసి ఈ నెల 16న గ్రామీణ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జాతీయ గ్రామీణ ఉపాధి పని చేసే ప్రతి పేదవాడికి రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో, నగరాలలో ఉపాధి పని చూపించాలని చెప్పారు. కార్మిక హక్కులను కాపాడుకోవడానికి చట్టాలు కఠినంగా అమలు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని తదితర అంశాలపై గ్రామీణ బందులో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బిజెపి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శాఖ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, వేణుగోపాల్, ఎం.కర్ణ, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు నాగన్న, ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏసన్న, రామిరెడ్డి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, కెవిపిఎస్ నాయకురాలు గంధం హుస్సేనమ్మ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టం రద్దు చేయాలి

- 16న దేశవ్యాప్త రవాణా సమ్మె
- జయప్రదం చేయండి : మోటార్ వర్కర్స్ యూనియన్

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - డోన్

రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న డ్రైవర్ల మేడకు ఉరితాడు లాంటి భారత న్యాయ సంహిత 2023 హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఈనెల 16వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వి.భాస్కర్ రెడ్డి, టి.శివరాం కోరారు. బుధవారం స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన రవాణా రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టంలోని సెక్షన్ 106/1 ప్రకారం ప్రమాదానికి కారణం అయిన డ్రైవర్ కు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా,ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి డ్రైవర్ పారిపోతే హిట్ అండ్ రన్ సెక్షన్ 106/2 ప్రకారం పదేళ్ల జైలు, 10 లక్షల జరిమానా విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు అనేక రకాల కారణాలు ఉంటాయని వాటికి డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. రవాణా రంగ కార్మికులతో పాటు వాహన యజమానుల పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. ప్రమాదాలకు అసలు కారణాలను పరిశీలించి,సమస్యలను పరిష్కరించాలని,రోడ్ల వెడల్పు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని,ప్రజలలో రహదారి భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు హుస్సేన్ పీరా,శివరంగస్వామి, ఆదినారాయణ రెడ్డి, ధనుంజయ గౌడు,ఆజిపీరా, జబ్బార్,ఆటో యూనియన్ నాయకులు మద్దయ్య,మహేష్, శ్రీనివాసులు,వెంకటేశ్వర రెడ్డి, సూరన్న,బాలు, నాగేశ్వరరావు, బాబు,ప్రైవేట్ స్కూల్ బస్సు యూనియన్ నాయకులు మద్దిలేటి,నూర్ భాషా,ఖాసీం, కంబగిరి,ఆర్టీసీ హయర్ బస్సు యూనియన్ నాయకులు సుబ్బయ్య గౌడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఏర్పాట్ల పరిశీలన

మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

మార్చి 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. పుష్కరిణి, సిద్ధరామప్పకొలను, మెట్ల మార్గం, డార్మెంటరీలు, బస్టాండ్ ప్రాంతం, బసవ వనం తదితర ప్రదేశాలను ఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ పుష్కరిణి ప్రాంతంలో తగినంత విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి భక్తులు కూర్చునేందుకు తగిన స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక కళ్యాణకట్టను ఏర్పాటు చేయాలని చెప్పారు. మెట్ల మార్గంలో మరమ్మతులు చేపట్టాలన్నారు. సమీపంలో ఉన్న రహదారికి కుడి వైపున ల్యాండ్ స్కేపింగ్ గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం పాత వర్క్‌షాప్ ప్రాంతంలో రహదారికి డివైడర్‌లో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. డార్మెంటరీలలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు నిరంతరం పనిచేసే విధంగా చూడాలన్నారు. భక్తులకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించాలన్నారు. మంచినీటి కుళాయిలకు నిరంతరం నీరు వచ్చేలా చూడాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ఆరుబయలు ప్రదేశాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయా ఆరుబయలు ప్రదేశాలలో చెత్త ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధికంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాత పార్కింగ్ స్థలాలలో గుంతలు లేకుండా చదును చేయాలన్నారు. ఆయా ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆరుబయలు ప్రదేశాలలో, రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు తీసి వేయించి జంగిల్ క్లియరెన్స్ త్వరగా చేయించాలని ఆదేశించారు. అనంతరం క్షేత్ర పరిధిలోని జల ప్రసాద్ ఆర్‌ఓ ప్లాంట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, మురళీధర్ రెడ్డి, సహాయ కార్య నిర్వహణ అధికారి మల్లికార్జున్ రెడ్డి, ప్రజా సంబంధాల అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సెక్యూరిటీ అధికారి అయ్యన్న, ఉద్యానవన శాఖ అధికారి లోకేష్, సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నేతలు ముందస్తు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఆత్మకూరు పట్టణంలో సిఐటియు నాయకులు వెళ్లకుండా పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్‌లను స్థానిక పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కార్యాలయం నిర్మాణానికి విరాళాల సేకరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సిపిఎం కార్యాలయ నిర్మాణం కోసం పార్టీ ఉద్యమ అవసరాల కోసం నంది కొట్కూరు పట్టణం వాల్మీకి నగర్‌లో సిపిఎం నాయకులు బుధవారం ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, సిపిఎం సీని యర్ నాయకులు ఏ రాజశేఖర్, కె భాస్కర్ రెడ్డి, పి.పకీర్ సాబ్, టి గోపాలకృష్ణ, శాలు, పాండు స్వాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

డోన్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్ కేటాయింపు

- మంత్రి బుగ్గనకి సప్తశైల సుమిత్ర రాజేష్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-డోన్

మంత్రి బుగ్గనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న సప్తశైల సుమిత్రరాజేష్

అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో డోన్ ప్రజల చిరకాల కోరిక వైయస్సార్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్‌లను కేటాయించినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కి వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ సప్తశైల సుమిత్ర రాజేష్ డోన్ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇప్పటివరకు డోన్ నియోజక వర్గంలో విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంజనీరింగ్ మెడిసిన్ లాంటి కోర్సులు ఉండేవని డోన్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్ రావడం వల్ల ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థులకు, వ్యవసాయ రంగముకు సంబంధించిన ఉద్యోగాలు రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

జగనన్న ఆరోగ్య సురక్షతోనే పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా ఆరోగ్య సౌకర్యాలు కల్పించడమే వైసిపి లక్ష్యమన్నారు. ప్రస్తుతం పట్టణంలో ప్రతి వారానికి ఒక రోజు సచివాలయాల వారిగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసిల్దార్

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలని తహశీల్దార్ తిరుపతయ్య అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఏర్పాట్ల గురించి స్థానిక వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 37 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులు ఉండాలని అధికారులకు సూచించారు. వీఆర్వోలు బాబుమియా, మౌలాలి, వేణుగోపాల్, రామ సుబ్బయ్య, నరసింహ పాల్గొన్నారు. **ప్యాపిలి :** మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. ప్యాపిలి పట్టణంలోని బిసి కాలనీ, మండలంలోని మాందొడ్డి, పలు గ్రామాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల, వికలాంగులకు ర్యాంపులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సోమశేఖర్, నవీన్, బిఎల్ఒలు, సూపర్వైజర్స్ పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ బి. రామచంద్రుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి, ఓటు హక్కు వినియో గించుకునే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు ఇతర మౌలిక వసతులు అన్ని ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్, బాత్రూమ్, తాగునీరు సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట ఆర్ ఐ సురేంద్ర నాథ్ రెడ్డి సూపరిండెంట్ రామకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలన చేస్తున్న తహశీల్దార్

9న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జిల్లాలో ఫిబ్రవరి 9న చేపట్టే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్‌ఓ వెంకటరమణ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సిరివెళ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసులో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఫిబ్రవరి 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని సిరివెళ్ల ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, జిల్లా వైస్ చైర్మన్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్, సిరివెల్ల మండల మైనార్టీ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, ఐఒఆర్‌డి నాగేంద్ర తదితర అధికారులతో కలిసి డీఎం హెచ్వో వెంకటరమణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ అవగాహన పోస్టర్లను అన్ని గ్రామ సచివాలయం, విద్యా సంస్థలలో, వైద్య శాలల్లో ప్రదర్శించి బాల లలో అవగాహన కల్పించాలని కోరారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకో వడం, శౌచాలయానికి వెళ్లి వచ్చాక చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా, పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ వెంకటరమణ మాట్లాడుతూ 9వ తేదీ నాటికి జిల్లాలో ఈ మందులు సుమారు 5.40 లక్షల వరకు అందుబాటులో బఫర్ తో కలిసి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ అధికారి కాంతారావు నాయక్ , వైద్యాధికారి డాక్టర్ దివ్య, డాక్టర్ ముఖేష్ , సిహెచ్‌ఓ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పథకాలు గడప వద్దకే చేర్చాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాడే రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు గడప వద్దకే చేర్చాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ గోవిందు నాయక్ పేర్కొ న్నారు. బుధవారం పట్టణంలోని పశువైద్యశాలలో ఆళ్లగడ్డ డివిజన్ పశు సంవర్ధక శాఖ అధికారులు , సిబ్బందితో నంద్యాల జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ గోవింద్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ గోవింద నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా ద్వారా 75 శాతం సబ్సిడీతో పశువులకు, గొర్రెలకు, మేకలకు బీమా సౌకర్యం కల్పించిందని, ఈ పథకం మీద పాడి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గొర్రెలు మేకలలో పిపిఆర్ వ్యాధి టీకాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.కొత్తగా ఎంపికైన పశు సంవర్ధక సహాయకులకు త్వరలోనే ఆర్బికే క్లస్టర్స్ కి నియమించడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే సంక్షేమ పథకాలను గడప వద్దకే చేర్చే బాధ్యత పశుసంవర్ధక శాఖ సిబ్బంది తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య, పశు గణాభివద్ధి సంస్థ ఈవో డాక్టర్ రాజశేఖర్, సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారామ్,డాక్టర్ బ్రహ్మం,డాక్టర్ గిడ్డయ్య, డాక్టర్ కొండారెడ్డి,డాక్టర్ వర ప్రసాద్,డాక్టర్ మోహన్ రావు, పశువైద్యులు, డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ రాఘవేంద్రారెడ్డి, డాక్టర్ బైరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కోనేటి భారతీదేవి, డాక్టర్ ఐశ్వర్య, పారా వెటర్నరీ సిబ్బంది, గ్రామ సచివాలయాల పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి

నేత్రాలు దానం చేస్తున్న చైర్మన్

చైర్మన్ చలం రెడ్డికి పితృవియోగం

- నేత్రాలు దానం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి తండ్రి అయిన సిహెచ్ లక్ష్మిరెడ్డి (78) అనారోగ్యంతో మృతి చెందారు. సిహెచ్ చలం రెడ్డి, సిహెచ్ కార్తీక్ రెడ్డి, తమ తండ్రి నేత్రదానం చేస్తామని లైఫ్ యువనేత్ర సమితి సభ్యులకు తెలిపారు. ఈ మేరకు కర్నూల్‌లోని ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నేత్ర సేకరణ నిపుణులు ప్రదీప్ నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతులు మీదుగా తీసుకున్నారు. కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

లక్ష్మిరెడ్డి (ఫైల్‌ఫోటో)

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు, సిఐటియు నాయకులతో కలిసి ఎంపీడీవో విజయరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, రాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో నేడు వారికి పూట గడవడం కష్టంగా ఉందన్నారు. వెంటనే వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి

400 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం : ఎపిడి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 400 ఎకరాలలో ఉద్యానవన పంటలు సాగు చేయడానికి లక్ష్యంగా అనుకున్నామని ఉపాధి ఏపీడి సాంబశివరావు, ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 400 ఎకరాలు హార్టికల్చర్ టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. జాబ్ కార్డు వెరిఫికేషన్ చేయమని తెలియజేశారు. ఎలక్షన్ కోడ్ వచ్చే లోపల జిల్లా కలెక్టర్ అను మతితో తీసుకున్న పనులను మాత్రమే పెట్టవలసి ఉంటుంది కాబట్టి రెండు రోజుల లోపల పనుల గుర్తింపు కార్యక్రమం పూర్తి కావాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని తెలియజేశారు. కుటుంబాల పని సగటు వేతనం పెంచవలెనని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధి ఏపీవో ప్రతాప్, ఈసీ సుబ్బన్న, సంబంధిత గ్రామ పంచాయతీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠ శాలు ఫిబ్రవరి 10వ తేది రెండవ శనివారము, 11వ తేది ఆదివారము సెలవు దినములు (పబ్లిక్ హాలిడేస్) ఈ సెలవు దినములలో ఏ పాఠశాల కూడా ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని జిల్లా విద్యాశాఖాధికారి కె. సుధాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ ఏ పాఠశాల అయినా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ఆ పాఠశాల యాజమాన్యముపై కఠిన చర్యలు తీసుకో నబడునని, సంబంధిత ఉప విద్యాశాఖాధికారి మండల విద్యాశాఖాధి కారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా విద్యాశా ఖాధికారి ప్రకటనలో తెలిపారు.

భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు నందు బుధవారం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గత కొన్ని ఏండ్ల నుండి కల్వర్టు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ తమ దృష్టికి రావడంతో వెంటనే పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జి చింతా శ్రీనివాసులు, వైసిపి నాయకులు వి.ఆర్ శ్రీను, చక్రపాణి, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

ఏఎస్ఐని పరామర్శిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి

ఏఎస్ఐని పరామర్శించిన గుండం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి బుధవారం పరామర్శిం చారు. ఏఎస్ఐ కృష్ణారెడ్డి ఐదు రోజుల క్రితం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బందోబస్తుకు వెళ్లి ప్రమాదవశాత్తు బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఏఎస్ఐ కృష్ణారెడ్డిని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండంశేషి రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాండ్ల భూపాల్ రెడ్డి, ఖాతా వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనులు
- మార్చి లోపు రూ.10 కోట్లు రెవిన్యూ వసూళ్ల కు చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి. నిరంజన్ రెడ్డి

నంద్యాల పట్టణంలో దోమల బెడద అధికంగా ఉంది.. వీటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.. నెల చివరిలోగా ప్రతివార్డును మూడు సార్లు టచ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని నంద్యాల పురపాలక సంఘం కమీషనర్ పి. నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో ప్రజాశక్తితో పలు విషయాలను వెల్లడించారు. ఈ నెల 5 వ తారీఖు నుండి పట్టణంలోని ప్రతి వార్డులో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పారిశుధ్య పనులపైన ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. మురికి కాలువల్లో దోమల లార్వా వృద్ధి చెంద కుండా చేయడం, కాలువల్లో స్ప్రే చేయడం, పాగింగ్ చేపట్టడంతో పాటు ఆయా వార్డులలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, డ్రైనేజిల్లో పేరుకపోయినా చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు కమిషనర్ వివరించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఉన్న పారిశుధ్య సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఈ నెల చివరి నాటికీ ప్రతి వార్డులో మూడు సార్లు పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకున్నమన్నారు. రెండు నెలల్లో మున్సిపాలిటీకి రావలసిన రెవిన్యూను రాబట్టె ందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామనితెలిపారు. ఇంకా మున్సిపాలిటీకి రూ.10 కోట్లు రెవిన్యూ రూపంలో పన్నులు వసూలు కావాల్సి ఉందని రెండు నెలల్లో వసూలు చేస్తామన్నారు. పట్టణ సుందరీకరణను, పట్టణ అభివృద్ధికి నిధులు అవసరం కాబట్టి పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇంటి పన్నులు, కొళాయి, ఖాళీ స్థలాల పన్ను లు వ్యాపార సముదాయల ట్రేడ్ లైసెన్స్ పన్నులను కట్టి మున్సిపాలిటీకి సహకరించాలని కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నంద్యాలలో అభివృద్ధి జాడే లేదు

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శిల్పా పాలనలో నంద్యాలలో అభివృద్ధి జాడలెక్కడా కనిపించడం లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ విమర్శించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని వై.యస్.నగర్ నందుటీడీపీ నాయకులు బబ్బగ రాముడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న ఫిరోజ్ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఫిరోజ్ మాట్లాడుతూ రెండు అడుగుల రోడ్డు వేసి శిలా ఫలకం వేసుకోవడం ఎటువంటి అభివృద్ధి అంటారో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవికే తెలియాలని ఎద్దేవా చేశారు. నలుగున్నారేళ్ల పాలనలో అభివృద్ధి అంటూ కల్లబొల్లి మాటలు చెప్పి మభ్య పెడుతున్నారని ప్రజలను ఓట్లు అడిగే ధైర్యం లేక ఎన్నికలకు రెండు నెలల ముందు గేట్లు ఎత్తేశామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సైకోజగన్ పాలన అంతమై సామాన్య ప్రజల పాలన రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఈదుర్మార్గమైన పాలనను రాష్ట్రం నుండి తరిమి కొట్టడానికి టీడీపీ-జనసేన కూటమిలు అహర్నిశలు శ్రమిస్తున్నాయన్నారు. సైకిల్ గుర్తుపై ఓటేసి మాజీ మంత్రి ఎన్.ఎమ్.డి ఫరూక్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు విజయ గౌరీ యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు మరాఠీ సూరి, తాటికొండ మహేష్, వడ్డే నాగేంద్ర, మునగల రమేష్ రెడ్డి, ఇమామ్ హుస్సేన్, తలారి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎన్ ఎండి ఫిరోజ్

పోటీలను ప్రారంభిస్తున్న బ్రహ్మానంద ఆచారి

'క్రీడలతో బంగారు భవిష్యత్'

ప్రజాశక్తి - బనగానపల్లె

క్రీడలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటు ందని శ్రీ జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి పేర్కొన్నారు. బుధవారం మండలం లోని పలుకూరు గ్రామంలో మైన్ ప్రాథమిక పాఠశాల బ్రహ్మానంద అచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులను అంద జేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శరీరక దృఢత్వం ఏర్పాడుతుం దన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలను ప్రోత్సహిం చడానికి ప్రభుత్వం క్రీడాకారులకు విద్యలోనూ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు మధుకిశోర్, ఎస్. డి. హుస్సేన్, విశ్వ భారతి, కొండలరావు ,శేషు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి జనసేన చేయూత

ప్రజాశక్తి - వెలుగోడు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెలుగోడు పట్టణానికి చెందిన షేక్ ఖాజా హుస్సేన్‌కు జనసేన మండల నాయకులు శాలుబాషా, దూపం అభిమన్యుడులు బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఖాజా హుస్సేన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు నాయకులు బొజ్జ శేషు కుమార్, శ్రీరాములు, పురం హరీష్, రాజేష్, షాహిద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఖాజా హుస్సేన్ ను పరామర్శిస్తున్న జనసేన నాయకులు

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

- మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పారిశుధ్య పనులపై అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పి. నిరంజన్ రెడ్డి శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం 7:30 గంటల నుంచి 7, 8 వార్డులు కలెక్టరు ఆఫీస్, పద్మావతి నగర్‌లో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమీషనర్ వెంట శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సెక్రెటరీలు తదితరులు ఉన్నార

వార్డులో శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ తదితరులు

వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ ధార

సమస్యల పరిష్కారానికి కృషి : వైసిపి

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి నందికొట్కూరు ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధార తెలిపారు. బుధవారం మండలంలోని ప్రాతకోట, గణపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆ గ్రామాలలోని వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాలలో వాడవాడలో ఆయన పర్యటించి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న వ్యవసాయ కూలీలతో ఆయన కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి, వైసిపి మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఘనపురం సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : వైసిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వైసిపి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామారెడ్డి, ఎంపిపి గోకుల లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్ట వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచి మహేంద్రమ్మలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో రూ. 26 లక్షలతో సిసి రోడ్డు, రూ. 38.4 లక్షలతో సచివాలయం, రూ. 23.94 లక్షలతో వైయస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ. 12 లక్షలతో చేపట్టిన స్మశాన వాటికను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి మనోహర్, యుఆర్‌డి బాలకృష్ణ, బోరెడ్డి రాము, భువనేశ్వర్ రెడ్డి, చంద్ర కళారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విగ్నేశ్వర రెడ్డి, సాగర్, ఏడిఏ అశోక్ వర్ధన్ రెడ్డి, పిఆర్ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఏవో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధే ధ్యేయం

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తపల్లి

నల్లమల అడవుల్లో వెలసిన కొలనుభారతి ఆలయ అభివృద్దే ధ్యేయమని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామ శివారులో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో ఆలయ పాలకమండలి చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పురోహితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చదువుల తల్లి సరస్వతి దేవి సన్నిధిలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక దేవాలయం కొలను భారతి ఆలయమని, ఈ ఆలయ అభివృద్ధి కోసం తాను శక్తి వంచన లేకుండా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. కొలను భారతి ఆలయం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇలాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. ఈ క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం వల్ల భవిష్యత్తులో మంచి ప్రయోజకులవుతారని అన్నారు. అనంతరం కొలనుభారతి చైర్మన్‌గా బోయ వెంకట నాయుడు, కమిటీ సభ్యులుగా రామిరెడ్డి, చంద్ర కళావతమ్మ, సునీత, నేనావత్ శివమ్మ బాయ్, వెంకటేష్, మణికంటేష్‌లతో కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచి చంద్రశేఖర్ యాదవ్, బాల ఎల్లయ్య, వైస్ ఎంపిపి సింగారం రంగ, మాజీ వైస్ ఎంపిపి మహబూబ్ బాషా, ఎంపిటిసి శివన్న, స్రవంతి, బాలరాజు, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, మాజీ చైర్మన్ రామ సుబ్బారెడ్డి, ఈవో మోహన్, వైసిపి నాయకులు ఎర్రం శ్రీనివాసులు యాదవ్, రామకృష్ణుడు, మహబూబ్ బాషా, నాగలక్ష్మి రెడ్డి, ముని, రంగ, నాగ ఎల్లయ్య, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణుడు, నారాయణ రెడ్డి, నాగన్న, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీ సభ్యులతో సిద్ధార్థ రెడ్డి

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముకుందకు సన్మానం చేస్తున్న నాయకులు

'మిస్టర్ ఆంధ్ర' విజేతకు సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో మిస్టర్ ఆంధ్ర మొదటి విజేతగా నిలిచిన నంద్యాల వాసి ముకుందను మాజీ డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఏసు రత్నం, పుల్లా నరసింహ తదితరులు బుధవారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏసురత్నం, పుల్ల నర్సింహ డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదిన ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో నంద్యాల జిల్లాకు చెందినటువంటి బి ముకుంద 75 కిలోల విభాగంలో మొదటి స్థానం సాధించి, మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ ఓవరాల్ విజేతగా నిలిచాడ న్నారన్నారు. నంద్యాలలోని న్యూ బాడీలైన్ జిమ్ హెల్త్ ఫిట్‌నెస్ క్లబ్ నందు కోచ్ ఖ్వాజా మొహిద్దీన్ దగ్గరా శిక్షణ తీసుకుంటు ఈ ఘనత సాధించడం జరిగింద న్నారు. ఈ సందర్భముగా కోచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు బాల వెంకట్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమారు, నాయ కులు రాజు తదితరుల జిమ్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గుర్తించి పైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. శాప్ చైర్మెన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నంద్యాలకు పేరు తెచ్చిన బాడీ బిల్డర్ వారిని గుర్తించి పైన సత్కారం చేయాలని పేర్కొన్నారు.

సిఐకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సిఐ గోపినాథ్ రెడ్డిని కలిసిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డిని బెలుం గ్రామానికి చెందిన సిఐటియు అనుబంధ సంస్థ అయిన గని కార్మిక సంఘం నాయకులు సుబ్బ రాయుడు తదితరులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రాక్టర్ డ్రైవర్ యూని యన్ నాయకులు దానమయ్య, బీసీ కంబయ్య, తోక బాలుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్ నూతన తహశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-డోన్

డోన్ తహశీల్దార్‌గా కె.మాధవ కృష్ణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా పులివెం దులలో తహశీల్దారుగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. తహశీల్దార్ కె మాధవ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సంబంధించి పగడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వీఆర్వోలు తహశీల్దార్‌ను కలిసి శు భాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి ఉద్యమం

- జమాఅతె ఇస్లామీ హింద్

ప్రజాశక్తి - నంద్యాల

మాట్లాడుతున్న జమాఅతె ఇస్లామీ హింద్ నేతలు

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం - ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం నినాదంతో జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమం నిర్వహిస్తుందని జమాఅతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్ తెలిపారు. స్థానిక జమాఅత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి 8 - 18 వరకు 11రోజుల మత్తు పదార్థాల నిర్మూలన ఉద్యమంలో జేఐహెచ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన కల్గిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో నంద్యాలలో "ఆంటి డ్రగ్" కమిటి ఏర్పాటు చేసి వివిధ ఎన్జీవోలతో కలిసి డ్రగ్ వ్యతిరేక ప్రదర్శనలు, అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్లు నిర్వహిస్తుందని, పుర ప్రముఖుల, అధికారులను కలిసి ప్రజా సంబంధాల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమద్ తెలిపారు. నంద్యాలలో ఈ ఉద్యమం నిర్వహణకు పి.వి ముస్తఫా ను కన్వీనర్ గా, అబుబకర్ సిద్దీఖ్, అబ్దుల్ అలీం, బేగం అమ్తుస్సలామ్‌లను కో కన్వీనర్లుగా ఎన్నుకున్నాట్లు, ఆబీద్, సాజిద్, మహబూబ్, అబ్దుల్లా తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జమాఅతె ఇస్లామీ నంద్యాల జిల్లా బాధ్యులు సీ.యం. జకరియా, మోమీన్, ఫజ్లే హఖ్, జీలాన్, నవాజ్ ఖాన్,జైనుల్లా, మస్లిహుర్రహమాన్, సలీం, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కు సన్మానం చేస్తున్న దృశ్యం

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం విద్యాశాఖాధికారిని శోభా వివేకావతి గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీద కమాండేషన్ సర్టిఫికెట్ పురస్కారాన్ని విశిష్ట సేవ పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం అపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ ఆధ్వర్యంలో అలాగే ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యవస్థాపకులు శ్రీనాథ్ రెడ్డి, ప్రెసిడెంట్ మల్లికార్జున, నంద్యాల డివిజన్ అపుస్మ అధ్యక్షులు అమిర్ బాషా, కోశాధికారి సుబ్రహ్మణ్యం, శివకుమార్, తిరుపాల్ రెడ్డి, విక్టర్, ఆళ్లగడ్డ మండలం విద్యాధికారి -2 గంగాధర్, విజయకుమార్, అరుణోదయ హెచ్ఎం ఇమా హుస్సేన్, సీఆర్పీలు గురునాథ్, కృష్ణమూర్తి ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జోష్న, డిటిపి ఆపరేటర్ ఎస్ఎం బాష, మెసెంజర్ గాబ్రియల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా శోభా వివేకవతిని శాలువతో పూలమాలతో సత్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

సంజామల ఎస్ఐగా రమేష్ రెడ్డి

ప్రజాశక్తి - సంజామల : సంజామల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రమేష్ రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.కొలిమిగుండ్ల ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై సంజామలకు వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 46/2023
O.S.No. 61/2023

1) Pandillapalli Ravanamma, W/o.Late P. Chandrayudu, Hindu, aged 50 years.
2) Pandillapalli Chandrakanth, S/o. Late P. Chandrayudu Hindu, aged 33 years.
Both are residents of D.No. 1/373, Ashok Nagar, Chihna Chowk, Kadapa City, Y.S.R.District.
...Petitioners/Plaintiffs
AND
1) Pandillapalli Chandra Sekhar, S/o. Late P. Chandrayudu, Hindu, aged 36 years, residing at D.No. 1/372-1, Ashok Nagar, Chinna Chowk, Kadapa city. Now residing at Gopalle Village & Post, Rajupalem Mandal, Kadapa District.
2) Mangali Venkata Krishna, S/o. M. Subbarayudu, Hindu, aged about 38 years, residing at House No.3-27-100-4, Thimmareddy Nagar, Yalluru Village & Mandal, Kurnool District.
...Respondents/Defendants

NOTICE TO RESPONDENT No.2

Please take notice that the Hon'ble Court has ordered for notice to the respondent No.2 to appear on 20-02-2024 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
ANDE SUBRAMANYAM,
B.A., L.L.B.,
Advocate for Plaintiff,
KADAPA.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ATMAKUR
I.P. NO: 5/2024

1. Avula Prathap
H.No:18-194-21, Dwaraka Nagar,
Velugod town and Mandal, Nandyal district
2. Avula Uma Maheshwari W/o A. Prathap
H.No: 18-194-21, Dwaraka Nagar,
Velugod town and Mandal, Nandyal district.
...Petitioners

Versus

1.Kamsali pullamma w/o suryanarayana, Age about 45 years, Sai Baba Nagar, Opp site Government School, Nandyal Town and District. Cell No: 9949995684
2. Avula Kalyani @ Rani W/o Kiran Kumar, age about 38 years, Deva Nagar Panchamukha Anjaneya Swamy pakkana, Nandyal town and District.Cell No: 7702379648
3. Ahmad Husain S/o Karim Sahib, age about 58, VC Colony, Dargah pakana, Nandyal town and District. Cell No: 7330885453
4.Venkata subbayya, age about 50 years, Deva Nagar, R/o Venkat Suba stores, Nandyal town and District. Cell No: 9440121549
5. Avula Nagamani W/o Ramaiya, age 23 years, Deva Nagar, No: 1 Hostel - Valmiki Gudipakana, Nandyal town and District Cell No: 8096209411
6. Medari Nagaraju S/o Narayana, H.No; 13-178, Old bus stand, Veldhurthi Village and Mandal, Kurnool district. Cell No:9989642546
7. B Venkataramana S/o Naganna, aged about 42 years, Police Station Road, Gopalpeta Village, Pebheru mandalam, Vanaparthy district. Cell No: 9063176926.
...Respondents

నోటీసు

ఇందుమూలంగా రెస్పాండెంట్స్ అయినా మీకు తెలియచేయడమైనది ఏమనగా పై పిటిషన్ లో అర్జీదారులు అయినటువంటి ఏ.ప్రతాప్ మరియు ఏ. ఉమామహేశ్వరి వీరు పై కేసులో మీకు వ్యతిరేకంగా IP పిటిషన్ వేసి ఉన్నారు. సదరు పిటిషన్ లో మీరు హాజరు కావలసిన తేదీ 29-02-2024 నాటికి వాయిదా వేసి ఉన్నారు. కావున రెస్పాండెంట్స్ అయినా మీరు పైన తెలిపిన తేదీకి ఉదయం 10:30 గంటలకు సీనియర్ సివిల్ జడ్జి గారి హాజరై మీరు గాని మీ తరఫున న్యాయవాది ద్వారా గాని సంజాయిసి చెబుతూ కౌంటర్ దాఖలు చేయవలసిందిగా తెలియజేయడమైనది. కావున మీరు పై తేదీన సీనియర్ సిటిజెన్ కోర్టులో హాజరుకానియెడల సదురు పిటిషన్ను మీ పరోక్షమున చట్టరీత్యా తగిన విధంగా తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేదీ: 29-02-2024

R.BALARAM NAIK
M.A.,L.L.M.,
ADVOCATE
ATMAKUR-518422,
Nandyal Dist.
Cell: 9885858608

THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE:: ATMAKUR
I.P.No.02/2024

Shaik Muntaj @ S.K.Muntaj Begum, W/o.Shaik Khaleel, aged about 39 years, Muslim, Coolie, R/o.Near Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist. …Petitioner

-Vs-

1.Joseph, M/o.Kamalamma, Joseph Chicken Centre Owner Hole sale, R/o.Suleman Centre, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
2.Pinter Apparao, S/o. Not known to the petitioner, aged about 49 years, Pinter, R/o. Beside Govt., Guest House, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
3.Smt.Irfana, W/o.Madhar Vali, aged.38 years, Muslim, Business, R/o. H.No.G/216, Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
4.S.K.Imam Sa, S/o.S.K.Karimulla, aged 36 years, Muslim, Business, R/o. H.No.G/216, Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
5.Juturu Ashabi, D/o.Juturu Rasheed, aged.38 Years, Muslim, Business, R/o.H.No.G/200, Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
6.Smt.Moulabi, W/o.Khadar Vali, Aged 55 years, Private Chit Business, R/o.G/160, Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
7.Patan Hussain, S/o.Not known to the petitioner, aged.45 years, Muslim, Chicken Pakoda Busienss, R/o.Pedda Mazid Opposite, Khadar Hotel Area, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
8.Smt.D.Nagoorbi, W/o.D.Hassan, Aged 50 years, Private Chit business, Elementary School Line, Mutton Market, Sunnipenta village, Srisailam Mandal, Nandyal dist.,
9.D.Hussainamma, W/o. Niranjan, Aged 38 years, Muslim, Money Lender, R/o. Elementary School Line, Mutton Market Area, Sunnipenta village, Srisailam (M), Nandyal dist.,
10.Mounika, D/o.John, aged.28 years, Christian, Coolie, R/o.G/210, Mutton Market, Sunnipenta Village, Srisailam Mandal, Nandyal dist.,
11.Jeevana Jyothi, W/o.Parthasarathi Reddy, aged. 70 years, Finance business, R/o.Kasaiah Line, Mutton Market Area, Sunnipenta Village, Srisailam Mandal, Nandyal dist.,
12. S.D.Vali, S/o.Dasthagiri, aged.36 years, G/201, Mutton Market Area, Sunnipenta Vi, Srisailam Mandal, Nandyal dist.,
13.Durga Ramesh, S/o.not known to the petitioner, aged.52 years, Hindu, Sivadurga Private Finance, C/o.Bramhananda Reddy Hotel, Opp Jagadguru matam, R/o.Srisailam Village and Mandal, Nandyal dist.,
14.Durga Vasu, S/o.Not known to the petitioner, aged 48 years, C/o.Sukur S/o.Murthuja, R/o.Kiran shop, Opposite Mothi Mazeed, Mutton Market Area, Sunnipenta vi, Srisailam Mandal, Nandyal dist.,
15.Ayyapureddy, S/o.Not known to the petitioner, aged.47 years, Venkateswara Private Finance C/o.Sukur S/o.Murthuja, R/o.Kiran shop, Opp. Mothi Mazeed, Mutton Market Area, Sunnipenta vi, Srisailam Mandal,Nandyal dist.,
16.Prasad Vanasala, S/o.Not known to the petitioner, aged.48 years, Hindu, Gangothri Private Finance, C/o.Sukur S/o.Murthuja, R/o.Kiran shop, Opp. Mothi Mazeed Mutton Market Area, Sunnipenta vi, Srisailam Mandal, Nandyal dist.,
17.Srinu Anusani, S/o.Not known to the petitioner, Aged.49 years, Hindu, Manjunatha Private Finance, C/o.Sukur S/o.Murthuja, R/o.Kiran shop, Opp. Mothi Mazeed, Mutton Market Area, Sunnipenta, Srisailam Mandal, Nandyal dist.,
18. Nagendra, S/o. Not known to the petitioner Aged about 49 years, Hindu, Lakshmi Venkateswara Private Finance, R/o.Kiran shop, Opp Mothi Mazeed, Mutton Market Area, Sunnipenta vi, Srisailam Mandal, Nandyal dist.,
…Respondents

నోటీసు

ఇందుమూలంగా రెస్పాడెంట్స్ అయిన మీకు తెలియజేయటము ఏమనగా పై పిటిషన్ లో అర్జిదారురాలు అయినటువంటి షేక్ ముంతాజ్ ఏ ముంతాజ్ బేగం మీపై పై కోర్ట్ నందు మీకు వ్యతిరేకముగా ఐ.పి. పిటిషన్ వేసివు న్నది. సదరు పిటిషన్ లో తేది:23.02.2024 నాడు వాయిదా వేసివున్నారు కావున రెస్పాడెంట్స్ అయిన మీరు మరియు ఇంకా ఎవ్వరికైన అక్షేపణలు ఉన్నయెడల పైనా తెలిపిన తేదికి ఉదయము 10.30 గంటలకు పై కోర్ట్ ఎదుట మీరుగాని, మీ తరుపున న్యాయవాది ద్వార గాని సంజాయిషీ చెపుతూ కౌంటర్ దాకలు చెయ్యవలసినదిగా తెలియజెయ్యటం అయినది. మీరు హాజరు కాని ఎడల పై పిటిషన్ మీ పరోక్షమున కోర్ట్ వారు తీర్మనించేదరని తెలియచేయ్యటమైనది.

(కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 23.02.2024

యం. ఫజుల్ రహిమాన్,
అడ్వకేట్, ఆత్మకూరు, నంద్యాల్ జిల్లా.
సెల్ నెం.9985598509